క్లుప్తంగా

ఆరోగ్యంగా ఉంటేనే సుఖ ప్రసవం



కూడేరు: గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి

కూడేరు: గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే సుఖ ప్రసవం అవుతుందని మండల వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి తెలియజేశారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ గర్భిణులకు హిమోగ్లోబిన్, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి సౌమ్యా రెడ్డి గర్భిణులకు వైద్య సేవలందించారు. మానసిక ఒత్తిడికి గురికావొద్దన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఉద్దేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రుక్మిణీ, సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న లైబ్రేరియన్ మునెమ్మ

ఉరవకొండ: వజ్రకరూరు మండల గ్రంథాలయ శాఖ కార్యాలయంలో గ్రంథాలయ అధికారిణి మునెమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మర్ క్యాంపు ముగిసింది. దాదాపు 21 రోజుల పాటు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్, జాతీయ అవార్డు గ్రహీత బెంజిమెన్ హాజరై మాట్లాడారు.

నష్టాన్ని అంచనా వేయండి



శెట్టూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

శెట్టూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు కురుస్తున్నాయని, వర్షానికి దెబ్బ తిన్న పంటల వివరాలు, పిడుగులు పడి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. రోజు వర్షాలు కురుస్తుండంతో గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పర్యటించి, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, వీఆర్‌ఓలు తిప్పేస్వామి, శ్రీనివాసులు, నాగరాజు, గంగన్న, తిప్పేస్వామి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వీహెచ్‌ఏకు సన్మానం



వెటర్నరీ అసిస్టెంట్ సుబహాన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కూడేరు: మండలంలోని గొటుకూరు సచివాలయ పరిధిలో అనిమల్ అస్బెండరీ అసిస్టెంట్(ఏహెచ్‌ఏ) సుబహాన్ వెటర్నరీ అసిస్టెంట్ (వీఏ)గా పదోన్నతిపై గార్లదిన్నె మండలానికి వెళ్లాడు. శుక్రవారం స్థానిక పశు వైద్యశాలలో మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుబహాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు శ్రీనివాసులు, శ్వేత, ఏహెచ్‌ఏలు రఘువర్ధన్, సుబ్బరాయుడు, ఎర్రిస్వామి, రాఘవ, యశోద, భవాని, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



చికిత్స కోసం వచ్చిన రోగులు



మందుల కోసం క్యూకట్టిన దృశ్యం

వామ్మో..విషజ్వరాలు

- జ్వర బాధితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ కేసులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

రాయదుర్గం: వేసవి ముగిసింది.. వాతావరణం చల్లబడింది. ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దోమలు వృద్ధి చెంది, ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలతో బెంబేలెత్తుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. వారం రోజులైనా జ్వరాలు తగ్గకపోవడంతో బాధితులు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఆస్పత్రులకు చుట్టూ తిరుగుతున్నారు. దీనికితోడు దోమకాటుతో డెంగీ, మలేరియా, చికున్ గన్యా, బోధ కాలు, మెదడువాపు వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధి తీవ్రత పెరిగితే ఒక్కోసారి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రాయదుర్గం ఏరియా ఆస్పత్రితో పాటు కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ 3 సీహెచ్‌సీ, 30 అర్బన్, మండల పీహెచ్‌సీలు ఉన్నాయి. ఏరియా ఆస్పత్రిలో రోజుకు 500–600లకు పైగా ఓపీ పరీక్షలు నిర్వహిస్తే, అందులో ఎక్కువ శాతం జ్వరపీడితులే ఉంటున్నారు. అలాగే సీహెచ్‌సీతో పాటు పీహెచ్‌సీల్లో 250 నుంచి 300ల వరకు ఓపీ చికిత్సలకు రాగా, అందులోనూ అధిక శాతం జ్వరాలతో బాధపడుతున్న వారే ఉంటున్నారని వైద్యులు చెప్తున్నారు. ఇందులో కొందరికి రక్త నమూనాలు సేకరించి, డెంగీ పరీక్షలు చేయగా పదుల సంఖ్యలో బాధితులు తేలుతున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు జ్వరాలతో బాధపడేవారితో కిటకిటలాడుతున్నాయి. చికిత్సకు వచ్చిన ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది.

కూలర్‌తోనూ ప్రమాదమే..?

ఇంట్లో కూలర్లను సరిగా శుభ్రం చేసుకోవాలి. లేకపోతే ఆ నీటిలో డెంగీ దోమ వృద్ధిచెందే అవకాశం ఉంది. నీరు నిల్వ ఉంచినట్లయితే మనకు తెలియకుండానే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. దీనికి తోడు ఇంటి ఆవరణలో కొబ్బరి బోండాలు, పాత టైర్లు, పూలకుండీలు, దీపాలు, మట్టి పాత్రల్లోని నీరు కూడా రోగాలు రావడానికి కారణమే.

ఈ జాగ్రత్తలు అవసరం :

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పనికిరాని వస్తువులను పరిశీలించి, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- దోమలు వృద్ధి చెందకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమతెరలు వాడాలి. దోమలను పారదోలే పరికరాలను ఉపయోగించుకోవాలి.
- పనికిరాని గుంతలు, లోతట్టు ప్రదేశాలను, వినియోగంలోలేని బావులను పూడ్చివేయాలి. పెంట కుప్పలు, చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి.
- మురుగు కాలువల్లో పూడిక తీసి నీరు సాఫీగా వెళ్లేలా చేయాలి.
- మరుగుదొడ్ల గాలి గొట్టాల్లో మెష్ కట్టించాలి.
- అన్ని రకాల నీటి నిల్వ ఉండే ప్రదేశాల్లో వారానికి ఒకసారి దోమల లార్వా నియంత్రణ మందులు చల్లాలి. బావులు, నీటి మడుగుల్లో గంబూషియా చేపలను పెంచాలి.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో దోమ కాటు పెరిగి ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. ఆస్పత్రిలో ఓపీలోనూ జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఈ సీజన్ ముగిసే వరకూ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– మాధవి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల ప్రబలుతుండడంతో సిబ్బందిని అప్రమత్తం చేశాం. గ్రామాల్లో విష జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నాం. దోమల వల్ల ప్రబలే అనేక రకాల జ్వరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఈ కొద్ది రోజులు కాచి చల్లార్చిన నీరు తాగడం మంచిది. దోమల పట్ల ప్రజలంతా జాగ్రత్త వహించాలి. దోమలు కుట్టకుండా చూసుకుంటే జ్వరం రాకుండా ఉంటుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్లలో నీటి నిల్వలు లేకుంగా చూసుకోవాలి. వారినికోసారి డ్రైడే పాటించడం మంచిది. పీహెచ్‌సీల్లోనూ జ్వరాలతో ఎక్కువ మంది వస్తున్నారు.

– డాక్టర్ రమేష్, గుమ్మఘట్ట పీహెచ్‌సీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రవిశంకర్

కుందుర్పి: స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్, డివిజన్ ప్రోగాం ఆఫీసర్ రాజేష్ తదితరులు శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యలు, మాతాశిశు సంరక్షణ, తదితర అంశాలపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు నారాయణస్వామి, సోమశేఖర్, చాంద్‌బేగం, శశికళ, ప్రకాష్ సిబ్బంది మధుబాబు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం



కూడేరు: సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలలిత

కూడేరు: సమన్వయంతో పనిచేసి, మండలాభివృద్ధికి కృషి చేద్దామని ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) విజయల లలిత తెలిపారు. శుక్రవారం ఆ మె బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ నాగభూషణ రెడ్డి, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫా తి మా, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు.

హిందూ శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయండి



కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని హిందూ శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు కలెక్టర్ వి. వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్ తహసీల్దార్ కార్యాయం తనిఖీకి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా మృతిచెందితే శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వరమే సమస్య పరిష్కరించాలని ఆర్‌డీఓ రాణీ సుస్మితను ఆదేశించారు. ఆవులెన్న గ్రామానికి కూడా రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని తారు రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ రామ్ మోహన్ కలెక్టర్‌ను కోరారు.

149కు డయల్ చేయండి

రాయదుర్గంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ)లో ప్రయాణికులు ఫిర్యాదులు, సూచనల కోసం ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబర్ 149కు డయల్ చేయాలని రాయదుర్గం డిపో మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి సంప్రదించే వారు 0866–149కు డయల్ చేసి ఫిర్యాదులు చేయడంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వొచ్చని తెలిపారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



పార్టీ శ్రేణులతో సమీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య

- కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, మనం ఐదేళ్ల ప్రజా సంక్షేమానికి కృషి చేశామని, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ చేస్తున్న దాడులపై పలువురు నాయకులు రంగయ్య దృష్టికి తీసుకొచ్చారు. దాడులపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా ఎన్నికల ఫలితాలపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ శ్రేణులు సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని రంగయ్య స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, సర్పంచులు సత్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, నాయకులు ఎంఎస్ రాయుడు, భీమప్ప, యర్రంపల్లి కృష్ణమూర్తి, అడ్వకేట్ హనుమంతరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మన్న, రామిరెడ్డి, జాకీర్, రాజు, పలువురు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



దేవగిరి సచివాలయం వద్ద పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: గ్రామాల్లో ఎవరైనా రెచ్చగొట్టినా, అల్లర్లకు పాల్పడినా చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన దర్గాహొన్నూరు, దేవగిరి గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. దర్గాహొన్నూరు, దేవగిరి గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్ ఎస్‌ఐ వి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు



కూడేరు: మాట్లాడుతున్న డీఎస్పీ భాస్కర్ రెడ్డి

కూడేరు: ఎన్నికల ప్రక్రియ ముగిసింది. గ్రామాల్లో ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా గొడవలకు దిగి ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ భాస్కర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కూడేరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణే తమ ధ్యేయమన్నారు. గ్రామాల్లో తిరిగేందుకు మొబైల్ టీం (ఫోర్ వీలర్, టూవీలర్లలో)ను ఏర్పాటు చేశామన్నారు. గొడవలకు దిగితే రౌడీషీట్ తెరవడం, బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

గజలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



రాచెర్ల తండాలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మారుమూల గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా సహాయ అధికారి కె.సత్యనారాయణ పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని రాచెర్ల తండాలో మలేరియా సహాయ అధికారితో పాటు సబ్‌యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, పెద్ద కౌకుంట్ల పీహెచ్‌సీ అధికారిణి డాక్టర్ చందన తదితరులు పర్యటించారు. అనంతరం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌తో చర్చించి, రెండు నెలలుగా మలేరియా కేసులు ఎన్ని నమోదు అయ్యాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ గోవిందు, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, ప్రసాద్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



యూబీఐ నూతన బిజినెస్ కరస్పాండెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ నాగరాజు

బెళుగుప్ప: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని యూనియన్ బ్యాంకు మేనేజర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన బిజినెస్ కరస్పాండెంట్ కేంద్రాన్ని బ్యాంక్ మిత్ర భాగ్యలక్ష్మితో కలిసి బ్యాంక్ మేనేజర్ ప్రారంభించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తమ యూబీఐ సేవలను విస్తరించాలనే ఉద్దేశంతో అదనపు సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీరంగాపురం, గుండ్లపల్లి, నక్కలపల్లి, ఎర్రగుడి గ్రామాల్లో ఏర్పాటు చేసామన్నారు. ఆయా కేంద్రాల ద్వారా ఖాతాదారులు రూ.25,000 విత్‌డ్రాలతో పాటు రూ.50 వేల వరకు డిపాజిట్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ వీర ప్రసాద్, ఏబీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

10న ఆలయ భూముల వేలం

ఉరవకొండ: మండల పరిధిలోని బూదగవి ఆంజనేయస్వామి దేవస్థానం ఆలయ భూములు కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 10న వేలం వేస్తున్నట్లు ఆలయ గ్రూప్ టెంబుల్స్ ఈఓ అంగదాల కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2024–2007 వరకు మూడేళ్ల కాలానికి ఆలయ భూములు కౌలుకు తీసుకునేందుకు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గరుడాపురానికి చెందిన నాగార్జున, భాగ్యమ్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న టీచర్ బద్దేనాయక్ శుక్రవారం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.15వేలు, ట్రస్ట్ కార్యదర్శి హరీష్ రూ.5వేలు ఆర్థిక సాయంతోపాటు, 9 వేల విలువజేసే కిరాణా సరుకులను బాధిత కుటుంబానికి అందించారు.

ప్రమాదకర కాలువలో ఈత



వర్షపు నీటిలో ఈత కొడుతున్న శివరామిరెడ్డి కాలనీ పిల్లలు

ఉరవకొండ: అనంతపురం–బళ్లారి జాతీయ రహదారి సమీపంలో శివరామిరెడ్డి కాలనీ సమీపంలో వర్షపు నీరు బయటకు వెళ్లడానికి పంచాయతీ, రెవెన్యూ అధికారులు కాలువ తవ్వారు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి కాలువ ఉధృతంగా పారుతోంది. ఈ కాలువ గుంతలో సమీపంలో ఉండే శివరామిరెడ్డి కాలనీకి చెందిన చిన్నారులు ఈత కొట్టడానికి దిగారు. ఉధృతంగా పారుతున్న వర్షపునీటిలో ఈత కొట్టడం ప్రమాదకరమని స్థానికులు కొందరు ఆందోళన చెందుతున్నారు.

స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలు

అనంతపురం ఎడ్యుకేషన్: పీఎంకేవీవై రూపొందించిన స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఐఎంసీ) కమిటీ సభ్యుడు శేషాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. శేషాంజనేయులు మాట్లాడుతూ.. సాధారణ డిగ్రీలతో పాటు స్వల్పకాలిక కోర్సుల ద్వారా వచ్చే సర్టిఫికెట్లను అదనపు అర్హతగా భావిస్తారన్నారు. తద్వారా పారిశ్రామిక రంగం, సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మార్కెట్‌కు అనుగుణంగా అవసరమయ్యే కోర్సులను ఎంపిక చేసుకుని జీవితానికి మెరుగులు దిద్దుకోవాలన్నారు. మరో సభ్యుడు నీలకంఠారెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉత్పత్తి రంగానికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు తగిన నాణ్యత, నైపుణ్యాలను సొంతం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ.. పీఎంకేవీవై కింద ఇప్పటిదాకా 210 మంది అభ్యర్థులకు స్వల్పకాలిక కోర్సుల్లో అవకాశం కల్పించామన్నారు. ప్రస్తుతం 64 మందికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రతినిధి జగన్, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, కోర్సు కో–ఆర్డినేటర్ అపర్ణ పాల్గొన్నారు.

రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు



ఉద్దేహాళ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి నది

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా రెండు రోజులపాటుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో వరద నీరు ఎగువ ప్రాంతం నుంచి వస్తుండడంతో కొలగానహళ్లి వద్ద కబ్బాలి వంక, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నదికి భారీగా వరద నీరు చేరింది. మండలంలోని కృష్ణాపురం, రంగాపురం క్యాంపు, లింగదహాళ్, తదితర గ్రామాల శివార్లో సాగు అయిన పత్తి పంటలోకి నీరు చేరింది. దీంతో పత్తి మొక్కలు ఎర్రగా మారి కుళ్లిపోతున్నాయి. దీంతో రైతు పెట్టిన పెట్టుబడి కూడా అందే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. నాలుగైదు ఆకులున్న మొక్కలు చుట్టూ వర్షపు నీరు నిలవడంతో ఎరుపు రంగులోకి మారాయి.

గుమ్మఘట్టలో భారీ వర్షం

గుమ్మఘట్ట: మండలంలో భారీ వర్షం కురిసింది. 89.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులకు వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో జలకళ సంతరించుకుంది. కలుగోడు, రంగసముద్రం, గోనబావి, గొనికుంట, ఎస్.కొత్తపల్లి, నేత్రపల్లి గ్రామాల చెరువులకు వరదనీరు వచ్చి చేరడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల్లోకి చేరుతున్న వర్షపునీరు

బెళుగుప్ప : మండల వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. జూన్ నెలలో 2న 35.2 మిమి, 3న 71.4 మిమి, 5న 3.6 మిమి, 6న 41.8 మిమి, 7న 17.4 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదైందని ఏఎస్‌ఓ మమత తెలిపారు. వర్షాలకు ప్రధాన చెరువులైన బెళుగుప్ప మంగోటి చెరువు, నాగుల చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు, శీర్పి, శ్రీరంగాపురం, గుండ్లపల్లి చెరువులకు నీరు వచ్చి చేరింది.



బెళుగుప్ప చెరువులోకి చేరిన వర్షపునీరు



గోనబావి చెరువులో వర్షపునీరు



పత్తి పంటలో చేరిన వరద నీరు